# నమస్కారం


పాలడుగు వెంకటేశ్వరరావు

దేహంలో జీవుడ్ని నిలబెట్టటానికిగాను సదా గుండె కొట్టుకులాడుతుంది. అది దాని ధర్మం. గుండె గొంతుకలలోన కొట్టుకులాడుతూందని అప్పుడెప్పుడో మంచిపాట రాశాడు ఒక పెద్దాయన. ఆ సందర్భంవేరు. గుండె మనస్సులోను కొట్టుకులాడుతుందని అనుభవంమీద అనుకుంటున్నాడు ఆనందయ్య. ఈ సందర్భం ఇది. అప్పుడొకసారి, ఔను సూర్యం బెంగుళూరు నుండి రాసిన వుత్తరం అందుకున్న ఆ క్షణాన ఆనందయ్య గుండె, మనస్సులోని మధురోహలతో పెనవేసుకుని, పిచ్చిగా కొట్టుకులాడింది.

'ఎక్కడ్నించీ వుత్తరం?' సుబ్బమ్మ ఆరా తీసింది, వచ్చి వక్కన్నిలబడుతూ.

'నీ కొడుకు రాశాడు.' అన్నాడు గర్వంగా ఆనందయ్య.

అప్రయత్నంగానే ఆనందయ్య మూతి మీది మీసాలు నిక్కబొడుచుకున్నాయి. ఆ 'వూవు' అది.



'ఏంటి కబుర్లూ?' సుబ్బమ్మ అడిగింది, ఉత్సాహంగా.

'అంతా బాగానే వున్నారంట.' అన్నాడు ఆనందయ్య ఆనందంగా.

'ఎప్పుడొస్తానన్నాడు అబ్బాయి, మనల్ని చూడటానికీ?' అంది పిచ్చి కోరికతో.

'ఆహా! అంతకంటే మనవాడికి 'ఇంకొక' అర్జంటు పని ఏమీలేదని నీ వుద్దేశ్యమా?'

'సర్లేండి' మొహం చిన్నబుచ్చుకుంది సుబ్బమ్మ. రోషంతో ఆమె ముక్కులు ఎర్రగా అయినాయి. కనుకొనల్లో కొంత తడికూడా తొంగిచూసింది.

'అవునే! నువ్వు అలా అనుకోవటంలో ఏమీ అపసవ్యం లేదనే, నేనూ మనస్ఫూర్తిగా అంటాను. అంతలోనే అంతకోపమా?'

'తన కోపమే తన శత్రువు...' అంది ఉక్రోషంగా. 'ఉడికించటానికని నవ్వుటాలకన్నానులే కనుక, ఆ కోపాన్ని మూటగట్టి, నా మొహాన్న కాసిని నవ్వులు వెదజల్లు. వాటిల్లో కొన్నిట్నయినా ఏరుకుని నా జేబులో వేసుకుంటాను. 'నువ్వు నవ్వితే చాలా బాగుంటుంది.' అన్నాడు. సుబ్బమ్మ నవ్వింది. మబ్బుతెర తొలిగి వెన్నెల విరజిమ్మినట్లయ్యింది.

'సర్లే. అయితే నేను వస్తాను. లోపల చాలాపనుంది.' అంటూ ఆమె వెళ్లబోగా చెయ్యిపట్టుకుని ఆపాడు ఆనందయ్య, ఆమెని, ఉత్సాహంతో.

'ఛీ! ఏమిటిదీ?! ఎవరన్నా చూస్తారు.' కోపం నటించింది. ఆనందయ్య తెల్లమొహం పెట్టాడు. ఈ ఆడాళ్లెప్పుడూ ఏదేదో అనుకుని విడ్డూరాలు పోతారు, అనుకుని, 'ఓర్నీయమ్మ! ఇప్పుడు నేనేం జేశానే!?' అన్నాడు.

'చాల్లేండి. ఇక మారు కొనండి. అంది బింకంగా.

'నీకు ఇంకా చెప్పవలసిన విశేషాలు వున్నాయి. అందుకే ఆగమంటున్నాను.'

'సరే చెప్పండి. దానికి ఇంత రాద్ధాంతం కావాలా?!' అంది.

'మన నళినీకి అదే కంపెనీలో వుద్యోగం వచ్చిందట. మంచి జీతం ఇస్తారట. పోతే సూర్యానికి ప్రమోషన్ వచ్చిందట. జీతం బాగా పెరిగిందట. అయితే ఇద్దరికీ ఒక్కక్షణం కూడా తీరిక వుండదట. పైగా ఉద్యోగాల్లో టెన్షన్ బాగా వుంటుందట...'

సుబ్బమ్మ ముభావంగా వింటూ వుండిపోయింది. కోడలలి ప్రస్తావన సడన్‌గా ఆమెలో మార్పు తెచ్చింది.

'అసలే ఆ అమ్మాయికి చిరాకు ఎక్కువ గదా...' ఆనందయ్య ఆగాడు.

'అటువంటప్పుడు ఎందుకూ ఆ అమ్మాయికి ఆ ఉద్యోగమూ?... ఇల్లుచూసుకోకా'

'అది వాళ్ల ఇష్టం. ఆ మాట అంటానికి నువ్వెవరు? నేనెవరు?'

'అవుననుకోండి! ఇవి మననాటిరోజులు కావు గదా.'

'అవునా! పిల్లల్తో ఇబ్బందిగా వుందట. వాళ్లు ఏం తింటున్నారో, ఎట్లా వుంటున్నారో, ఏ విధంగా చదువుతున్నారో పట్టించుకోవటానికి వీళ్లకి వీలుకావటం లేదట!' సుబ్బమ్మ నిట్టూర్చింది. ఆమె గుండె గుబగుబలాడింది; సుడులు తిరిగింది.

' ఈ విధంగా చాలా గ్రంథమే రాశాడు సూర్యం...'

బాధతో మూగగా లోలోపలే మెలికలు తిరిగింది సుబ్బమ్మ గుండె.

' చివరన ఒక మాట రాసాడు, వాడు. బెంగుళూరు వాతావరణం హైదరాబాద్ కంటే బాగా వుంటుంది. ఒంటరిగా మీరిద్దరూ అక్కడ వుండి ఏం చేస్తారు? హైదరాబాద్‌లోని ఇల్లు అద్దెకు ఇచ్చేసి మీ ఇద్దరూ వచ్చి మా దగ్గర వుండకూడదూ? పిల్లలకి కాస్త సహాయంగానూ వుంటుంది అందరం కలిసివున్నట్లూ వుంటుంది అని. ఏమంటావు?' అని భార్య వంక పరిశీలనగా చూశాడు ఆనందయ్య.

'నా సంగతి సరే! మీరు ఏమంటారో ఆ మాట చెప్పండి, ముందు' అని బంతిని ఆనందయ్య కోర్టులోకే నెట్టింది ఆమె. ఆ గుంజాటనకి కారణం లేకపోలేదు.

కడుపుల్లో ఆపేక్షలుండికాదు. కేవలం అవసరార్థం, వచ్చి తమదగ్గర వుండమని తమని అభ్యర్థించాడు కొడుకు. ఆ అవసరం తీరిపోయాకా, పిచ్చికుక్కల్ని తరిమికొట్టినట్టు, ఈటెల్లాంటి సూటిపోటీ మాటల్తో వేధించి తగలేస్తుంది, ఆ కోడలు. ఆమె నోటికి ఎదురాడలేడు సూర్యం. అసలు ఈ ప్రతిపాదన గురించి ఆ నళినీకి తెలుసునో లేదో?! అది వేరే సంగతి.

ప్రేమ అనేది కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా? అడ్డాలనాడు మాత్రమే బిడ్డలుగాని గడ్డాలనాడు కాదు కదా. అమ్మా, బాబూ అని తమ బిడ్డకి ఇంకా తమ మీద 'భ్రమ' ఏమూలో మిగిలి వుంటే వుండవచ్చును, కానీ, పరాయితల్లి కన్న ఆ కోడలు పిల్లకి అత్తమామల మీద గౌరవం అభిమానం వుండి తీరాలన్న రూపేమీ ఒకటి లేదు గదా. ఒకవేళ ఆ రూలు వుండినా, ఈ రోజుల్లో దాన్ని పట్టించుకునేదెవరు?

కేవలం వ్యాపార బంధాల మీదే ఆధారపడి నడుస్తూ వున్న ఈనాటి పరస్పర సంబంధాల బ్రతుకుల ఎడారుల్లో, అనుబంధాల కొరకు వెదకులాడటం, ఎండల్లో ఎండమావుల్లోని నీటిని గురించి వెంపర్లాట చెందటం వంటిదే గదా. అవునన్నా లేక మొహమాటంతో కాదని ఖండించినా, ఇవి నిష్ఠూర సత్యాలు. అయినప్పటికీ వీటిని గురించి పైకి మాట్లాడటం అసహ్యంగా అనిపిస్తుంది. అందుకే ఇవి కాలకూట విషాల్లాగా గొంతుల్లోనే అట్లా నిలబడిపోవాలి. తత్ఫలితంగా గుండె మనస్సుపొరల్లో కొట్టుకులాడి, ఆయాసడిపోయి, తీరని ఆవేదనని మిగుల్చుకోవటమే ఆఖరికి మిగిలేది. మనిషికి ఇది ఒక శాపం. ఒక 'వస్తువు' యొక్క దృశ్యరూపం దాన్ని చూసే కోణాన్ని బట్టి వివిధంగా మార్పు చెందుతూ వుండటం కద్దు. ఒక తల్లి తన బిడ్డను ప్రేమించటం, ఆ బిడ్డ కొరకు ఎటువంటి త్యాగానికైనా సిద్ధంకావటం, ఒక సహజ సిద్ధమయిన ఉన్నత మానవ స్వభావ వీచిక వలే అనాదినుండి కీర్తింపబడి వున్నది. కానీ అది ఒక జీవియొక్క స్వాభావిక లక్షణమని అందులో 'నాది' అనబడిన ఒక సంకుచిత భావనకూడా చోటు చేసుకున్నదనీ వేరొక కోణంనుండి గమనించి చేసిన విశ్లేషణ కాదనబడకపోయినా ప్రశంసలకు నోచుకొనలేదు. కారణం ఇందులో ఆదర్శాల అల్లికలు లేకపోవటమే.

ఒక తల్లీ కూతురూ వుంటారు. మనిషి అన్న తరువాత లోపాలు తప్పవు. ఆ కారణంగా స్పర్థలూ రాక మానవు. వాదులాటలూ ఘర్షణలూ వుండకపోవు. దెబ్బలాటలూ వుంటాయి. అలకలూ, అపార్థాలూ చోటుచేసుకొనక మానవు. అయితే ఎన్ని గొడవలు జరిగినా, విచిత్రంగా, కొంత సమయానికి, అన్నీ మరిచిపోయి ఇద్దరూ తిరిగి సఖ్యతతో అతుక్కుపోతారు. పరస్పరం క్షమించుకుంటారు. అది నా కూతురు గదా. చిన్నపిల్ల. పోన్లే అనుకుంటుంది తల్లి. జన్మనిచ్చింది. పెంచిపెద్ద చేసింది. అమ్మ నాకోసం ఎన్ని చేసింది! కన్నతల్లిగదా. నన్ను ఒక మాట అంటే అన్నది. నన్ను అట్లా అనే హక్కు నా తల్లికి లేదా? పెద్దతనం వలన ఛాదస్తం వచ్చింది. అంతేగానీ అసలు మా అమ్మ ఎంత మంచిదీ! అనుకుంటుంది కూతురు.

అయితే ఆ విధంగా కూతురు చూసిన కోణం నుంచి, ఎంతమంచి పిల్లయినా, ఒక కోడలు తన అత్తగారిని చూడగలదా? అట్లాగే కూతుర్ని చూసిన విధంగా అదే కళ్లతో ఒక అత్తగారు తన కోడల్ని గమనించి సరిపెట్టుకొనగల్గుతుందా?! కొనదుగాక కొనదు. అందుకు కారణం లేకపోలేదు. ఆ మూడు ముళ్లూ పడిన దగ్గరనుండి ఆ 'స్పర్థ' మొదలవుతుంది, నేను, నా భర్త, నా పిల్లలు, నా కుటుంబం అనుకుని కొన్ని సంవత్సరాలుగా నిర్మించుకొని వున్న అత్తగారి రాజ్యపు పునాదులు అప్పట్నుంచి పగుళ్లు ఇవ్వటం ఆరంభిస్తాయి. అందుక్కారణం, కొత్తగా ఎల్లలు దాటి రాజ్య సరిహద్దుల లోపలికి ప్రవేశం చేసిన, కోడలే ముమ్మాటికీ, అని నమ్ముతుంది అత్తగారు. ఇంతకాలం తన చెప్పుచేతల్లో వుండిన గారాల కొడుకుని ఎగరేసుకు పోవటానికి వచ్చిన భూతంలాగా అనిపిస్తుంది కోడలు, ఆ అత్తగారికి. ఆ భావన గుండెల్లో గట్టిగా గూడుకట్టి, అప్పట్నుంచీ ప్రతి అంశమూ ఆమెకి ఆ కోణంనుండే అవగతమవుతోంది. అదే వరవడిలో

నేను, నా భర్త, నా సంసారం అన్న ఒక స్వార్థం నిండిన దృక్పథంతోనే ఆ కొత్త కోడలూ అప్పటినుండి ప్రతీ విషయాన్నీ గమనించటం ప్రారంభిస్తుంది. తనకీ తన భర్తకీ మధ్యన బలంగా అడ్డుగోడవలే నిలబడిన అత్తగారిని తొలగించటానికి సర్వశక్తులనూ కూడదీసుకుని ప్రయత్నాలు మొదలుపెడుతుంది. ఆ అమ్మాయి. సమిష్టి కుటుంబ వ్యవస్థలు వున్న ఆ రోజుల్లోనయితే అత్తగారిదే పై చేయి అయివుండవచ్చును గాని వ్యవస్థ తీరుతెన్నులు పూర్తిగా మారిపోయిన ఈనాడు, పెళ్లి చేసి కోడలు తన కొడుకుని అప్పగించి వదిలివేయటం



తప్ప, వేరు దారిలేకపోయింది ఈనాటి అత్తలకి. నేటి అత్తగారు ఒకనాటి కోడలు, నేటి కోడలు రేపటి అత్తగారు అన్న యదార్థాన్ని విస్మరించటం వల్లనే ఈ తకరారులన్నీ అని ఎవరయినా అన్న పక్షంలో అందులో కాదనటానికి ఏమీ లేదనే అనాలి. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే కోడలు నళిని పేరు ప్రస్తావనకి వచ్చినప్పుడల్లా సుబ్బమ్మగారి గుండె దడదడలాడి కొట్టుకుని గిలగిలా గిరికీలు తిరుగుతుంది ఇదుగో ఇప్పటిలాగానే. ఒకప్పుడు జరిగిన సంగతి సుబ్బమ్మకి బాగా జ్ఞాపకం ఇప్పటికీ. ఐ.ఐ.టీలో డిగ్రీ పూర్తిచేసి, బెంగుళూర్లో ఉద్యోగమై, పెళ్లిచేసుకుని కాపురం పెట్టిన తర్వాత, ఏడాదికి ఒకనాడు ఆకస్మాత్తుగా వూడిపడ్డాడు సూర్యం. సూర్యం, వాళ్లకి ఏకైక కుమారుడు. అంచేత కొడుకుని చూసుకుని ఆనందంగా పొంగిపోయారు వాళ్లు; అతన్ని కన్నవాళ్లు.

'ఏరా. అంతా బాగా వున్నారా?' ఆప్యాయంగా ప్రశ్నలు వేశారు.

'ఆఁ. అది సరేగాని మీరిద్దరూ బట్టలు సర్దుకోండి.' ముక్తసరిగా అన్నాడు సూర్యం. హడావుడిగా తయారయిపోయి ఇంటికి తాళం పెట్టి అతన్ని అనుసరించారు. డెలివరీకి నళిని హాస్పటల్లో చేరింది. సిజేరియన్ చేయాలన్నారు. దిక్కుతోచక తల్లిదండ్రులని తీసుకెళ్దామని వచ్చాడు. సహాయం అవసరమయింది. అదీ సంగతి.

'సోన్లేరా. మంచిపని చేశావు' అన్నాడు ఆనందయ్య కొడుకు చెప్పింది విన్నాక.

ఆ భగవంతుడు దయవలన అంతా సవ్యంగా జరిగింది. పాప పుట్టింది. పది రోజులు హాస్పటల్లోనే వుండి, తల్లీ బిడ్డా క్షేమంగా ఇల్లు చేరారు. కంటికి రెప్పలాగా నిద్రాహారాలు మాని రాత్రింబవళ్లు వాళ్లని కాపాడుకుంది సుబ్బమ్మ. ఒక నెల్లాళ్ల తర్వాత, అమెరికానుండి తిరిగి వచ్చిన నళిని తల్లిదండ్రులు, కూతుర్ని చూడటానికి వచ్చారు. వాళ్లు మొదటినుంచి అదొక రకం మనుషులు.

అప్పటికి నళిని బాగా కోలుకుంది. చంటి పాప కూడా వొళ్లు తొనలుకట్టి ముద్దుగా తయారయ్యింది.

అదుగో. అప్పట్నుంచీ ధోరణి మారింది. ఒకరోజు నళినికి పాలు ఇద్దామని వెళ్లినప్పుడు సుబ్బమ్మకి మాటలు వినపడ్డాయి బెడ్రూం లోపలనుంచి.

'ఇంకా ఎందుకే? మీ అత్తమామల్ని వాళ్ల ఊరికి పంపించెయ్యకుండా వూరుకున్నావూ? వాళ్లిద్దరూ ఎంతెంత తింటున్నారో నీకు ఏమైనా తెలుసా!'

'ఎందుకూరుకుంటానూ! ఆ ప్రయత్నం ఎప్పుడో మొదలుపెట్టాను, అమ్మా'..

'అందుకు పెద్ద ప్రయత్నం కావాలేమిటే?!'

'వెంటనే పంపిస్తే బావుండదేమో అని తటపటాయిస్తున్నారు అమ్మా, ఆయన.'

'ఇందులలో బావుండక పోవటానికి ఏముందే, మీ ఆయనకి అసలు ఏమీ తెలీదు. ఒట్టి అమాయకుడు.'

'అవుననుకో. అందుకే నచ్చజెప్పే ప్రయత్నం' గలగలా తల్లీ కూతుళ్ల నవ్వులు. ఒంటికి ఖారం రాసినట్లనిపించింది; రక్తం సలసల మరిగింది; గుండె భగ్గుమంది సుబ్బమ్మకి. తన కొడుకింట్లోనే తను పరాయిది! ఆవేళే భర్తకి అంతా చెప్పుకుని ఘొల్లుమంది. ఆనందయ్య ఆమెని ఓదార్చాడు.

'పిచ్చిదానా. ఊరుకో. ఎప్పుడయినా ఎక్కడ వుండవలసిన వాళ్లు అక్కడ వుంటేనే గౌరవం మర్యాదా నిలిచేది. ఈ ఇల్లు మనది ఎట్లా అవుతుంది? మనింటికి మనం వెడదాం. కొన్నాళ్లు ఓర్పుగా వుండు'. అన్నాడు.

అప్పట్నుంచీ మొదలయ్యాయి సాధింపులు; పరోక్షంగా వేధింపులూ. ఏమీ శ్రమదీసుకుని కొట్టనక్కరలేదు. తిట్టనక్కరలేదు. పొగబెట్టితే చాలు పొమ్మనక్కరలేకుండానే పోతారు అన్నట్టు, పొగబెట్టారు వాళ్లు.

'అప్పుడే వెళ్తారా? కొన్నాళ్లు వుండవచ్చుగదా.' అని పొడిమాటలతోనే మర్యాదలు చేసి రైలెక్కించాడు, కన్నకొడుకు సూర్యం.

ఆ పాటున ఇంటికి వచ్చిపడి అమ్మయ్య అనుకున్నారు ఇద్దరూ.

ఆనాడు జరిగింది తల్చుకుంటే గుండె కోసినట్లనిపిస్తుంది. కోడలు సంగతి సరే. నవమోసాలు మోసి కని, ఎన్నో త్యాగాలు చేసి పెంచి అంతవాడిని చేసిన కన్నకొడుకు సూర్యం దృష్టిలో, తల్లిదండ్రులు ఈనాటికీ పరాయివాళ్లుగా అన్పించడం ఎంత చిత్రం! ఆయా కారణాల కారణంగా విషయం నివురుగప్పిన నిప్పులాగా ఎటూ తేలకుండా భార్యాభర్తల ఇద్దరి మధ్యాపడి వుండగానే సూర్యం దగ్గరనుండి మూడు ఉత్తరాలు వచ్చాయి. అన్నిటిలోనూ అదే విషయం. చాలా ఇబ్బందిగా వుంది. మీరు వచ్చి ఇక్కడ వుంటే అనుకూలంగా వుంటుంది. మీ దగ్గరనుండి జవాబు రాలేదు. కారణం ఏమిటి? మా పరిస్థితిని మీరు ఎందుకు అర్థం చేసుకోరు?! మీరిద్దరూ అలా ఎందుకు తయారయ్యారో తలబ్రద్దలు కొట్టుకున్నా నాకు అర్థం కావటంలేదు.

రాను రాను సూర్యం రాసిన వుత్తరాల్లో నిష్ఠూరం పాలు ఎక్కువయ్యింది. ఆ తరువాత ఆ ఉత్తరాలు కూడా ఆగిపోయాయి.

నమస్కారం 2

'అమ్మమ్మా. అమ్మమ్మా' శ్రీకాంత్ వచ్చాడు.

'ఏంట్రా తాతా. మీ అమ్మ ఏం చేస్తావుంది?' ఉషారుగా మనవడ్ని పలకరించింది సుబ్బమ్మ.

'బాగానే వుందే. తాతగారికి ఇష్టమని ఉలవచారు పంపించింది, అమ్మ. ఇద్దామని వచ్చా'.

'తాతగారి ఇష్టాలేగాని మీకు ఈ ముసల్దాని ఇష్టాయిష్టాలు ఏమీ పట్టవేమిట్రా?'

'ఉలవచారు నీకూ ఇష్టమేగదే, అమ్మమ్మా' నవ్వాడు శ్రీకాంత్. 'మానాన్నే! మా నాన్నే! ఈ ముసలాళ్ల ఇష్టాలు తీర్చటానికని, ఎర్రని ఎండలో వెళ్లి రమ్మని నిన్ను తోలిందేమిట్రా మీ అమ్మ! అసలు దానికి మతి అంటూ వుందా అని!' కోపం ప్రకటించింది సుబ్బమ్మ.

'ఫర్వాలేదులేవే. ఎండలు నన్నేం జేస్తాయి!'

'బాగా చదువుకుంటున్నావట్రా నాన్నా?'


'బాగానే చదువుతున్నాను అమ్మమ్మా. ఎండల్లో బయటకు వెళ్లవద్దని తాతగారికీ నీకు చెప్పమంది అమ్మ.'

'చెవుల్లో అమృతం గుమ్మరించావు గదా, తాతా!'

'మరి నేను వెళ్లివస్తానే అమ్మమ్మా; క్లాసు వుంది. జాగ్రత్తా!'

'అట్లాగే. నువ్వు జాగ్రత్తగా వెళ్లిరా, తండ్రీ. బాగా చదువుకో. ఫస్టున పాసుకావాలి.'

వంటింట్లోకి చొరబడి రెండుగ్లాసులు మంచినీళ్లు త్రాగి వెళ్లిపోయాడు శ్రీకాంత్. సుమారు ఆరడుగుల పొడవు. ఎర్రటి శరీరచ్ఛాయ. నల్లని వుంగరాలజుట్టు. తీర్చిదిద్దినట్లు కనుముక్కుతీరు. బుద్ధిమంతుడు. చదువుల్లో ఫస్టు! చామనఛాయతో, రెపరెపా ఎదిగివస్తూవున్న సూర్యం కూతురు సుందరికి మంచి ఈడూ జోడూ, కుదిరిన వరస. అటువంటప్పుడు వాళ్లిద్దరికీ పెళ్లిచేస్తే బాగుంటుందని ఆశపడటం తప్పా? నేరమా?



అపరాధమా? దుష్టమయిన ఆలోచనా!?
కాదే!! మరి అట్లా ఎందుకయ్యింది?!

ఒక ఏడాది క్రిందట ఆఫీసు పని మీద హైదరాబాద్ వచ్చినప్పుడు, అతి ప్రయత్నం మీద ఒక గంటసేపు తల్లిదండ్రులతో గడిపాడు సూర్యం. ఆ సందర్భంలో అసంకల్పితంగానే మనసులోని మాటని బయటపెట్టింది సుబ్బమ్మ. దానికి ఆనందయ్య కూడా వత్తాసు పలికాడు.

'నీ కూతురు సుందరిని శ్రీకాంత్‌కి ఇచ్చి పెళ్లిచేస్తే ఎల్లా వుంటుందిరా, అబ్బాయ్!' అంది సుబ్బమ్మ. సూర్యం తలపట్టుకుని చాలాసేపు మౌనంగా వుండిపోయాడు.

'ఏమంటావురా?' రెట్టించింది.

'జరగని విషయాలని గురించి ఎందుకమ్మా, కలలు కంటావు?' అన్నాడు.

'ఏం? ఎందుకు జరగకూడదూ?! శ్రీకాంత్‌కి ఏం తక్కువనీ?' అడిగింది.

'వియ్యానికైనా, కయ్యానికైనా సమానత్వం వుండాలిగదా?' నవ్వాడు.

'ఏం? వాళ్లకి మీకున్నంత డబ్బులేదనేగా, నీ అభ్యంతరం? వాళ్లకీ మీకు సంబంధం కుదరకపోవటానికి, అదే నీ అభ్యంతరమైతే మీ నాన్నగారి స్వార్జితమైన, ఈ ఇల్లూ, మనూరులో వున్న పదెకరాల పొలం శ్రీకాంత్‌కి రాసి ఇస్తారు' అంది.


'రాసిస్తే రాసిచ్చుకోండి. కాని మీరు చెప్తున్న ఈ సంబంధం కుదిరేది కాదు.' అన్నాడు సూర్యం ఖచ్చితంగా. సుబ్బమ్మకి గుండెల్లో కుమ్మినట్లయ్యింది. కళ్లవెంట నీరు ఉబికింది. గొంతు ఒణికింది. నవనాడులూ, నొక్కుతున్నట్లు అన్పించింది.

'ఏం? ఎందుకు కుదరదని అడుగుతున్నాను'. అంది గద్గద స్వరంతో. అడిగావు గనుక చెప్తున్నాను. నళినీకి ఇష్టం లేదు.' అన్నాడు. బాంబు పడినట్లు ఉలిక్కిపడింది సుబ్బమ్మ. 'అదిగాదు. నేనడిగేది నీ ఇష్టం సంగతి' అంది ఆఖరి ప్రయత్నంగా.

'నా ఇష్టాయిష్టాలు ఎవరికి కావాలి' కఠినంగా అన్నాడు సూర్యం. రోషంగా చూశాడు.

'అంతేనా?' దిగాలుగా అంది సుబ్బమ్మ. 'ఇదేమిటి కొడకా!' అని ఆమె గుండె ఘూర్ణిల్లింది.

'అవును' అంతే. ఇంక ఎప్పుడూ ఇట్లాంటి ప్రస్తావనలు తేకండి. నేను ఈ విధంగానైనా బ్రతికి వుండటం మీకు ఇష్టంలేదా?' నిర్మొహమాటంగా అన్నాడు సూర్యం.




'ఏం? ఇప్పుడు నీకు ఏం తక్కువయ్యిందీ? పెళ్లాన్ని బుజాలమీదికి ఎక్కించుకుని కులాసాగానే రాజభోగాలు అనుభవిస్తున్నావుగా!' ఎదురు తిరిగింది సుబ్బమ్మ. అగ్ని పర్వతపులావాలా పడి గిలగిల కొట్టుకున్నట్లు గిజగిజలాడింది ఆమె గుండె.

'ఛీ' అని ఛీత్కరించి తక్షణం వెళ్లిపోయాడు సూర్యం. అంతే. మరల మొహం చూపలేదు అప్పటినుండి ఉత్తరం పత్రం కూడా లేదు.

'పులవచారు ఎక్కడిదే సుబ్బలక్ష్మీ?' భోజనం దగ్గర అడిగాడు, ఆనందయ్య.

'మీకిష్టమని సావిత్రి పంపించింది. శ్రీకాంత్ ఇచ్చి వెళ్లాడు.'

'నీ కూతురు మనస్సు చాలా దొడ్డదే, శ్రీమతీ' సాలోచనగా అన్నాడు.

'మీ కొడుకు వరసకంటేనా?' అంటించింది. మౌనంగా వుండిపోయాడు ఆనందయ్య.

రోజులన్నీకక ఒకేలా వుండవు. నష్టాలు మానులకు వస్తే, కష్టాలు మనుషులకు రాక తప్పదు. కాలం కలిసివచ్చిన నాడు తనంతటివాడు ఎవడూ లేడని విర్రవీగిన మనిషే, కష్టాలు చుట్టుముట్టిన సమయంలో దేవుడ్ని సాయం తెచ్చుకుని గట్టెక్కించమని ప్రార్థనలు చేస్తాడు. అనుకోకుండానే, సుబ్బమ్మ మంచాన పడింది. అప్పటివరకూ, రాయిలాగా వుండిన శరీరం చితికి అసహాయంగా గిలగిలలాడింది. ఛిద్రమిన శరీరం రోగాన్ని ఎదిరించలేకపోయింది. అది ముదిమి ప్రభావం. ఆ సమయంలో సావిత్రి వచ్చి తల్లిదండ్రులకి ఆసరాగా నిలబడింది. అది ముదిమి ప్రభావం. ఆ సమయంలో సావిత్రి వచ్చి తల్లిదండ్రులకి ఆసరాగా నిలబడింది. ఇంటిపని, వంటపనితోపాటు, తల్లిపక్క పీతిముడ్డి కడగడం దగ్గరనుండి, స్నానం చేయించటం, బట్టలు మార్చటం, అన్నం పెట్టటం, ఉచ్చగుడ్డలు ఉతకడం, అన్నిటినీ తన బాధ్యతగా అనుకుని భక్తిగా చేసింది. శ్రద్ధగా వేళకి మందు మాకులు ఇచ్చింది.

అయోమయంగా వున్న ఆనందయ్యకి వేళకి అన్నపానాదులు, కాఫీ, టీలు అమర్చిపెట్టింది. ప్రకాశం, శ్రీకాంత్ అప్పుడప్పుడు వచ్చిపోతూ వున్నారు. వాళ్లపాట్లు వాళ్లు పడుతున్నారు. సుబ్బమ్మకి నోరుపడిపోయింది. పెదాలు కదిల్చి భర్తకి ఏదో చెప్పాలని ప్రయత్నం చేసింది. ఆనందయ్యకి అర్థమయ్యింది, ఆమె అవస్థ.

'అబ్బాయిని చూడాలని వుందా? ఫోనుచేసి, రమ్మని, బాబుకి చెప్పమని ప్రకాశానికకి పురమాయించాను. ఇవాళో, రేపో బాబు వస్తాడులే'. అన్నాడు.

ఆ మాటలకి సుబ్బమ్మ మొహం ఆనందంతో వెలిగిపోయింది. ఆమె గుండెలు ఆప్యాయతతో, ఆత్రుతతో ఎగిరి ఎగిరి పడ్డాయి.

ప్రకాశం వచ్చాడు.

'ఏమయ్యింది ప్రకాశం? సూర్యంతో మాట్లాడేవా?' అడిగాడు ఆనందయ్య.

'మాట్లాడాను మామయ్యా'.

'సూర్యం బయల్దేరాడా? ఎప్పటికి వస్తున్నాడు?'

'తను అర్జంటుపని మీద కలకత్తా వెళ్తున్నాడట. ఇప్పుడు రావటం కుదరదట.'

'అంత అర్జంటు పనా?!' ఆనందయ్య గుండెలు ఘూర్ణిల్లాయి.

'నాలుగురోజుల తర్వాత మళ్లీ నన్నే ఫోన్ చేసి ఎట్లా వుందో చెప్పమన్నాడు. అవసరమైతే డబ్బు పంపిస్తానన్నాడు.' చెప్పాడు ప్రకాశం.

'డబ్బు పంపిస్తాడా?!' ఆనందయ్య మనసు మూగగా రోదించి ఘోషించింది.

'ఫర్వాలేదు మామయ్యా. ధైర్యంగా వుండండి. మేమంతా వున్నాం. అత్తయ్య త్వరలోనే నయమవుతుంది.' అన్నాడు, ప్రకాశం. కృతజ్ఞతతో అల్లుడి చేతుల్ని పట్టుకుని చాలాసేపు మౌనంగా వుండిపోయాడు ఆనందయ్య. చివరకి శక్తిని కూడాతీసుకుని 'అయ్యా! సూర్యం నీతో బాగానే మాట్లాడాడా?' అని అడిగాడు భ్రమ వదలక.

'ఏం మాట్లాడాడో చెప్పానుగదా మామయ్యా. ఎప్పుడూ బిజీగా వుండే మనిషి మనలో అంతకన్నా ఎక్కువగా ఏం మాట్లాడుతాడు?' అన్నాడు ప్రకాశం. ఆనందయ్ గుండె పొరలనుండి వెలువడి, కంటి అంచులకు చేరిన ముత్యపు బిందువులు ప్రకాశం దృష్టికి ఆనలేదు. సూర్యం కొరకు మూగగానే కలవరించి, కలతతో కిక్కరించి ఎంతో బాధగానే ఆ రోజుకి పదో రోజున సుబ్బమ్మ అంతిమ శ్వాస విడిచింది. ఆనందయ్యకు తెలుసు. చివరిక్షణాల్లో సూర్యాన్ని చూడాలని ఆమె గుండెలు ఎంతో

ఆత్రపడినాయి. కాని ఆమె కోరిక తీరనే లేదు!' సూర్యాన్ని తీసుకుని రమ్మని ప్రకాశాన్ని పంపించి, శవ సంస్కారాన్ని ఒకరోజు వాయిదా వేయించాడు ఆనందయ్య. అయినా కానీ అనుకున్నది జరగలేదు. కలకత్తానుండి సింగపూరు వెళ్లిన సూర్యం ఇంకా తిరిగి రాలేదట. ఒట్టి చేతుల్తో తిరిగివచ్చాడు ప్రకాశం. ఎంత విచిత్రమయినది ఇప్పటి కాలంపోకడ 'కనీసం కోడల్ని పిల్లల్ని అయినా, తీసుకుని రాలేకపోయావా ప్రకాశం' అన్నాడు ఆనందయ్య నిరాశగా, ఆవేదనగా.

'అడిగాను మామయ్యా. పిల్లలు సెలవలకని వాళ్ల అమ్మమ్మగారి ఊరుకి వెళ్లారట. నళినీగారు ఏదో కాన్ఫరెన్సులో హడావుడిగా వున్నారట. ఇప్పటికిప్పుడు రావటం కుదరదు. సూర్యంగారు వచ్చాక ఆలోచిస్తాంలే అన్నారు' అన్నాడు ప్రకాశం.

గొడ్డలిపోటు గుండెల్లో దిగినట్లు అన్పించింది ఆనందయ్యకి.

ఎవరు వున్నా ఎవరు లేకపోయినా, జరగవలసింది ఏదీ జరగక ఆగదు. దహన సంస్కారాలు ప్రకాశం చేతుల మీదుగా జరిగాయి. మట్టిలోనుండి వచ్చిన శశరీరం మళ్లీ మట్టిలో కలిసిపోయింది. కేవలం జ్ఞాపకాల్ని మాత్రం మిగిల్చి, సుబ్బమ్మ వెళ్లిపోయింది తన దారి తను చూసుకుని.

ఒంటరివాడుగా మిగిలిపోయాడు ఆనందయ్య.

'నాన్నా. ఒక్కడివీ ఎలా వుంటావు? మాతో వచ్చి వుండు.' బ్రతిమాలింది సావిత్రి. ప్రకాశం, శ్రీకాంత్ గట్టిగా పట్టుపట్టారు. నలుగురూ ఆమాటే అన్నారు.

బలవంతం మీద కూతురు ఇంటికి మకాం మార్చాడు, ఆనందయ్య.

ఇల్లు అద్దెకి ఇచ్చారు. అట్లా అంతా అయిపోయిన వారంరోజుల తర్వాత భార్యాపిల్లలతో వచ్చాడు సూర్యం.

'ఇల్లు అద్దెకి ఇచ్చి నాన్నని మీ దగ్గర పెట్టుకున్న సంగతి ఫోనుచేసి నాకు చెప్పవచ్చు గదా. దానివలన ఎంత ఇబ్బందయ్యింది?!' ప్రకాశాన్ని నిష్ఠూరమాడాడు సూర్యం.

ఫోను చేశాను బావా. మీరు ఊర్నించి ఇంకా రాలేదన్నారు! అన్నాడు ప్రకాశం.

ప్రకాశం ఇచ్చిన సంజాయిషీ సూర్యానికి సంతృప్తి కల్గించలేదు. ఆ సంగతిని సూర్యం మొహమే చెప్పింది.

తమ్ముడ్ని, మరదల్ని, పిల్లల్ని చూసి సావిత్రి ఆనందంతో తబ్బిబ్బయింది.

ఆప్యాయంగా వాళ్లతో కబుర్లు చెప ్పబోయింది. మేనకోడల్ని, మేనల్లుడ్ని చూసి పొంగిపోయింది. రకరకాల వంటలు పిండివంటలు చేసి నడుం విరుగగొట్టుకుంది. శ్రీకాంత్ మేనమామ, మేనత్తలతో ఆప్యాయంగా మాట్లాడబోయాడు. వాళ్లకి సపర్యలు చేసి లోటు రాకుండా చూశాడు.

కొడుకుని, కోడల్ని, పిల్లల్ని చూసి గతాన్ని మర్చిపోయి కొండ ఎక్కినట్లుగా సంతోషించాడు ఆనందయ్య. ప్రకాశం హడావుడి చేశాడు. ఇవతలివైపునుండి అంతా అభిమానం పొంగిపొర్లింది. కాని అవతలివైపునుండి ప్రతిస్పందనే లేదు. సూర్యం నోరారా ఎవరితోనూ మాట్లాడలేదు. నళిని, పిల్లలు అంతకన్నా ఎక్కువగానే ముడుచుకుని పోయి ముభావంగా వుండిపోయాడు. గత్యంతరంలేక ముళ్లమీద వున్నట్లు కాలక్షేపం చేశారు. ఎరిగినవాళ్లు వచ్చి, తల్లిపోయి సూర్యం కొండంత దుఃఖంలో వున్నాడనుకుని, పరామర్శించబోయారు. వాళ్లతోనూ అదేతీరు.

అచ్చారావు ఆనందయ్యకి బాల్యమిత్రుడు. చిన్నప్పుడు హైస్కూల్లో సూర్యానికి మేష్టరు. రిటైరై అక్కడే ఇల్లు కొనుక్కుని హైదరాబాద్‌లోనే సెటిలయ్యాడు. సూర్యం వచ్చాడని తెలిసి అభిమానంతో పలకరించటానికి వచ్చాడు. సూర్యానిది అదే ధోరణి! అచ్చారావు కొన్ని ప్రశ్నలు అడిగాడు. వాటికి ముక్తసరిగా సమాధానాలు మాత్రం చెప్పాడు సూర్యం.

'పాపం మీ అమ్మ చివరిరోజుల్లో నిన్ను చూడాలని ఎంతో తాపత్రయపడింది!!'

'ఎందుకండీ మాస్టారూ? ఛాదస్తం కాకపోతే! వీళ్లు ఇక మారరు'.

'సమయానికి నువ్వు వచ్చివుంటే బాగుండేదని అందరం అనుకున్నాము.'

'కుదరలేదుగదండీ! నేను ఏం చేససేది? అనుకున్నవన్నీ జరగవుగదా.'

'పాపం మీ అమ్మానాన్నల 'ఆశలన్నీ నీ మీదే, ఆ సంగతి నువ్వు దృష్టిలో పెట్టుకోవాలి.'

'మాస్టారూ! ఆశ పడినవారే నిరాశకు గురయ్యేది. ఇందులో నేను చెయ్యగలిగింది ఏమీ లేదు.'

'వాళ్లు ఎంతలేదన్నా, కన్నతల్లిదండ్రులు గదా. అట్లా ఎట్లా వుండగలరు?'

'కాదని ఎవరంటారండి? కాని ప్రయత్నం ఏది?'

'మీనాన్నని నీతో తీసుకెళ్తావా? ఆయనకి నువ్వు తప్ప ఎవరున్నారు?'

'నేను రమ్మంటే మాత్రం ఆయన వస్తారా? నాకు నమ్మకం లేదు.'

'రక్తసంబంధాలు బలవంతంగా తెంచుకోవాలన్నా అంత తేలిగ్గా తెగిపోయేవి కావు సూర్యం.'

సూర్యం ఆశ్చర్యం ప్రకటించాడు. 'ప్రపంచం ఎంత మారిపోయింది! మీరు కూడా పాతకాలపు ఆలోచనలని పట్టుకుని వేళ్లాడుతున్నారంటే నాకు నమ్మబుద్ధిగావటం లేదు' అన్నాడు.

ఆశ్చర్యపోవటం అప్పుడు అచ్చారావు వంతు అయ్యింది.

అతికష్టం మీద ఆ రాత్రి గడిపి పెట్టెలు సర్దుకొని ప్రయాణానికి తయారయ్యాడు ససూర్యం.

కనీససం రెండు రోజులయినా వుండమని బ్రతిమాలాడింది సావిత్రి. అందరూ అదే మాట అన్నారు. కాని సూర్యం వినలేదు. 'అర్జంటు పనులున్నాయి. వెళ్లాలి.' అని భార్యాపిల్లల్ని వెంటపెట్టుకుని వెళ్లిపోయాడు సూర్యం.

ఆనందయ్య కుంగిపోయాడు. కొడుకు ధోరణికి కుమిలిపోయాడు. ఆగలేక తన ఆక్రోశాన్ని అచ్చారావు దగ్గర వెలిబుచ్చాడు.


'కోడలు మావాడ్ని పూర్తిగా మార్చేసింది.' అన్నాడుదిగాలుగా.

'అదేంగాదు, సూర్యమే మారాడు' అన్నాడు అచ్చారావు ఖండితంగా.


'ఎట్లా?!'

'అతను తన చుట్టూ గిరిగీసుకున్నాడు. తను, తన భార్య, తన పిల్లలు ఇవే ముఖ్యం అతని దృష్టిలో. ఆ అమ్మాయి ప్రభావం కూడా కొంతవుంటే వుండవచ్చునుగాని అందుకు ఆమెనే బాధ్యురాలిని చేయటంలో న్యాయం లేదు. అయినా ఆనందం! నీకు అతనినుండి ఏం కావాలి? ఎందుకు అంతగా ఇదయిపోతున్నావు? అసలు నీ గొడవ ఏమిట్రా?!'

'ఒరే. నీకు తెలియదా? నువ్వూ ఒక తండ్రివే గదా!' అన్నాడు ఆనందయ్య నిర్వేదంగా. 'రోజులు మారిపోతున్నాయి. మనుషుల తీరుతెన్నుల్లో వైపరీత్యాలు చోటుచేసుకుంటున్నాయి. పిల్లల్ని కన్నాం. పెంచిపెద్ద చేశాం. ప్రయోజకులుగా తీర్చిదిద్దాం. తల్లిదండ్రులుగా అది మన



బాధ్యత. ఆ బాధ్యతని తృప్తికరంగా నెరవేర్చామని ఆనందించాలి మనం. అంతేగాని అందుకు ప్రతిగా మనం పిల్లలనుంచి ఏదో ఆశించటం భావ్యం కాదు ఆశించి భంగపడి వేదనతో క్రుంగిపోవటంలో విజ్ఞత లేదు. వాళ్లదారిన వాళ్లు ఆనందంగా వున్నారని ఆనందించాలి గాని మన కోరికల్ని వాళ్ల నెత్తిన రుద్ది, అవి తీర్చలేదని వాళ్లని నిందించడం, భంగపడి ఇట్లా వేదనకి లోనుకావటం తెలివిగలవాళ్లు చేససే పన్లేనంటావా?!'




నమస్కారం3

'అచ్చారావు! నీ మాటల్లో ఎంతో సబబు వున్నట్లు అనిపిస్తోందిరా. కానీ '

'ఆలోచించు. నీకే తెలుస్తుంది.'

ఆనందయ్య ఆలోచించాడుగాని అచ్చారావు ప్రవచించిన ఆ మార్గాన్ని అంత తేలికగా జీర్ణించుకోలేకపోయాడు. ఆ కారణంగా, గుండె చప్పుళ్లు అతని మనోధృతిని కకావికలం చేయటం మానలేదు.

కొన్నాళ్ల తరువాత వున్నట్లుండి ఆనందయ్య కొడుకుని చూసి రావాలని బెంగుళూరు ప్రయాణం కట్టాడు.

ప్రకాశం ఆఫీసుకీ, శ్రీకాంత్ కాలేజీకి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా సావిత్రి వున్న ఆ సందర్భంలో 'అమ్మాయ్. ఏం చేస్తున్నావు?' అంటూ వచ్చిన అచ్చారావుని, 'కూర్చోండి మాస్టారూ' అని కూర్చోపెట్టి మర్యాదా చేసింది సావిత్రి.

'ఎట్లా వున్నారమ్మా?' అంటూ ఇంట్లో అందర్నీ పేరు పేరునా పరామర్శలు చేశాక, అడిగి ఒక పెద్దగ్లాసుడు చల్లనికుండ నీరు తెప్పించుకుని, అప్పుడు అసలు విషయానికి వచ్చాడు అచ్చారావు.

'ఉన్నట్లుండి మీ నాన్న బెంగుళూరు ఎందుకు ప్రయాణం కట్టాడో తెలుసునామ్మా?' అన్నాడు. 'తమ్ముడ్ని చూసి రావటానికని చెప్పారు' అంది సావిత్రి యధాలాపంగా.

'అదేంగాదమ్మా.' అన్నాడు అచ్చారావు. అని బరువుగా నిట్టూర్చాడు.

'మీనాన్న నువ్వు అనుకున్నంత సాదాసీదా బోళామనిషి గాదమ్మా.' అన్నాడు.

ఏంటండి మాస్టారూ!' ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసింది సావిత్రి.

'ఈ మనుషులేమిటో, వీళ్ల కడుపుల్లో ఎటువంటి చిత్రవిచిత్రమయిన ఆలోచనలు, ఏ కారణం వలన పుట్టుకుని వస్తాయో, తలబ్రద్దలు గొట్టుకున్నా నాకయితే అర్థమయి చావటం లేదమ్మా. నువ్వు మీ అమ్మకి ఎంత చేశావు! మీ నాన్నకి ఎంత చేస్తున్నావు. అందరికీ తెలిసినదే గదా. అయినా మనిషికి, కృతజ్ఞత అనేది లేకపోయింది! అదే నా బాధ. కళ్లతో చూసిందాన్ని నమ్మాలి గదా.

మీకు ఎవరికీ తెలియకుండా, నాకు మాత్రమే తెలిసి, నీ తండ్రి ఈ మధ్య ఒక వ్యవహారం చేశాడమ్మా. అతడు ఆ పని అట్లా ఎందుకుగాను చేసాడో ఆ భగవంతుడికే తెలియాలి. ఆ సంగతి నాతో అతను ప్రస్తావించగానే, చెవినిల్లు కట్టుకుని చెప్పాను, మీ నాన్నకి. అది నా బాధ్యత అనుకుని అడగకుండానే సలహా ఇచ్చాను. 'ఒరే. వాడు నిన్ను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. పై పెచ్చు నీ పట్ల, నీ భార్య పట్ల మీరు జన్మనిచ్చిన తల్లిదండ్రులన్న కనికరం ఏమాత్రం చూపించకుండా, నిర్దయగా ప్రవర్తించాడు. నిన్ను, నీ తోటివారి వునికినీ భరించలేనని పరోక్షంగా ప్రకటించి దూరంగా వెళ్లిపోయాడు. తన ప్రవర్తనని సమర్థించుకొనటానికని ఏవేవో సిద్ధాంతాల్ని వెతికి తెచ్చి గుమ్మరించాడు. అటువంటి మనుషుల మీద ఎందుకురా ఇంకా నీకు భ్రమా? ఆ భ్రమని వీడి, యదార్థాన్ని గమనించు. కష్టాలు పడి వచ్చినప్పుడు, నిన్ను నీ భార్యని కడుపులో పెట్టుకుని సాకింది. సేవలు చేసింది. మీకోసం ఎన్నో చేసింది. ఆడపిల్లగా మీ కడుపున పుట్టినందుకుగానూ కృతజ్ఞత చూపింది సావిత్రి, అట్లా! ఆ పిల్లకి ఏమిచ్చినా తీర్చుకోలేనిది ఆ ఋణం.'

అని నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పాను మీ నాన్నకి అప్పుడు!

'ఒరే! నా పని అయిపోయింది. ఎప్పుడు పోతానో నాకే తెలీదు. అందుకని నావి అంటూ మిగిలివున్న ఈ ఆస్తిపాస్తులకి ఏదో ఒక ఏర్పాటు చేయాలి. అందువలన ప్లీడర్ని పిలుచుకురా.' అని ఒకనాడు నన్ను తరిమాడు మీనాన్న. పిల్చుకొచ్చాను.

'స్వార్జితమై, ఇంకా అట్లాగే నిల్చివున్న, ఈ ఊర్లోని ఇంటిని గురించీ, మీ ఊర్లో వున్న పొలం గురించీ వీలునామా రాయించి, సంతకం చేసి, నాతో సాక్షి సంతకం కూడా పెట్టించి మీనాన్న రిజిస్టరు చేయించాడు. అది చేతికి రాగానే అతని కాలు నిలువలేదు. బెంగుళూరికి ఆఘమేఘాలమీద ప్రయాణం కట్టాడు. ఆ వీలునామాని భద్రంగా సూర్యం చేతిలో పెట్టి జన్మ ధన్యం చేసుకుని తిరిగిరావాలని అతని తాపత్రయం అని నాకు అర్థం అయ్యింది.'

సావిత్రి వింటూ వుండిపోయింది అచ్చారావు మాటలని.

'సావిత్రీ. ఇంతకీ అందులో మీనాన్న ఏం రాయించి సంతకం పెట్టాడో తెలుసానామ్మా?'

తెలియదన్నట్లు తల అయోమయంగా అటూ ఇటూ వూపింది సావిత్రి.

'ఆ ఇల్లూ, పొలం సమస్తం తన తదనంతరం సూర్యానికే చెందాలని రాయించాడు వాడు. మీకోసం ప్రాణం ఇవ్వటానికి కూడా వెనుకాడని కన్నకూతురికి అన్యాయం చేయ్యకురా అని చివరిదాకా వాడితో పోట్లాడాను. నా మాట వినలేదు. మీనాన్న గొప్ప దుర్మార్గం చేశాడమ్మా. అతన్ని ఆ భగవంతుడు కూడా క్షమించడు. వాడు అసలు అట్లా ఎందుకు చేశాడో నీకయినా ఏమయినా అర్థం అయ్యిందా తల్లీ?' అన్నాడు అచ్చారావు బాధగా.

ఆ మాటలకి సావిత్రి నవ్వింది. 'మీరు ఎందుకు అంతగా బాధపడుతున్నారో నాకు అర్థం కావటంలేదు. నాన్నగారు చేసిన ఈ పనిలో ఏమీ అపసవ్యత లేదు, మాస్టారూ' అంది.

'ఎందువల్ల?! కాస్త నాకు ఆ వివరం చెప్పు. విని తెలుసుకుంటాను.' అన్నాడు.

'న్యాయంగా తండ్రి ఆస్తిపాస్తులు కొడుక్కే చెందాలి గదా.' అంది సావిత్రి.

"ఏమిటా న్యాయం?' కూతురికి చెందకూడదని ఎవరన్నారు? ఎవరా పెద్దలు? " రోషంగా అన్నాడు.

'ఇంకెవరు? మనందరమే. నిన్నటివరకూ అలాగ చట్టాలు చేసుకుని అమల్లో పెట్టుకున్నాం గదా. అందువల్లనే నాన్న ఆలోచనలు, ఆ వరవడిలోనే పడిపోయి, ఆ విధంగా జరిగివుంటుంది. పోన్లెండి మాస్టారూ. నాకూ నా భర్తకీ, కావల్సింది ఆస్తిపాస్తులు గాదు. మీరూ, మీతోపాటు నాన్నగారూ. ఆ విషయం గ్రహిస్తే అదే మాకు పది వేలు'

అని అచ్చాకాలుకి రెండు చేతులెత్తి నమస్కారం చేసింది సావిత్రి. అవమానంతో తలని క్రిందికి దించుకుని, నిర్వీణ్ణుడై శిలా విగ్రహంలాగా అట్లాగే కూర్చుని వుండిపోయాడు అచ్చారావు.